క్లుప్తంగా

నేడు సీపీఐ మండల మహాసభ

సామర్లకోట: స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సీపీఐ మండల మహాసభ నిర్వహిస్తున్నట్టు మండల శాఖ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే నెల 15, 16వ తేదీలలో జిల్లా మహాసభలు సామర్లకోట పట్టణంలోని రైతు భవనంలో జరుగుతాయన్నారు. ఈ మేరకు ముందుగా మండల మహాసభలు నిర్వహించి ముఖ్యమైన సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడం జరుగుతుందని చెప్పారు. అయా తీర్మానాలను జిల్లా మహాసభలలో ప్రవేశ పెట్టి చర్చించి స్తామని తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

సామర్లకోట: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ కె. హిమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు హాజరు కావాలన్నారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు

సామర్లకోట: తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్‌శాఖ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవాకం 33వ రోజుకు చేరింది. కాగా వారిలో ఐక్యత లోపించడంతో సోమవారం నుంచి పలువురు విధులకు హాజరవుతున్నారు. సమ్మెలో కార్మికులు సుంకర నాగేశ్వరరావు, కేవీ రమణ, బి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, వి.భాస్కర్, ఎస్ సత్తిరాజు, డి.రాజు, పి.శ్రీను పాల్గొన్నారు.

పామాయిల్ మడ్డి కోసం రైతుల ఆందోళన



పతంజలి పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పెద్దాపురం: స్థానిక ఏడీబీ రోడ్డులోని పతంజలి పరిశ్రమ ఎదుట పాడి రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమకు పామాయిల్ గెలలు సరఫరా చేసే రైతులకు పామాయిల్ మడ్డిని (పామ్ కెర్నల్ కేక్)ను తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఆ మడ్డిని తమకు ఇవ్వడం వల్ల పశువులకు దాణాగా వాడేవారమని, కానీ ఇటీవల కాలంలో దానిని బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని దీంతో పాల దిగుబడులు రాక తాము నష్టపోతున్నామని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు మన్యం దేవబాబు, ప్రసన్నకుమార్, కల్యూరి శ్రీనివాస్, చిన్న, పెనుమర్తి దొరబాబు, చిన్న, సురేష్, సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పరిశీలన



కిట్ల వివరాలను పరిశీలిస్తున్న భాస్కరరావు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించే రోజున ఇచ్చే విద్యార్థి మిత్ర కిట్లను రాష్ట్ర సాల్ట్ ప్రోగ్రామ్ సూపరింటెండెంట్, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్స్ ఇన్‌చార్జి సీహెచ్ భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల పుస్తకాలు, బ్యాగ్‌లు, కిట్లను భద్రపర్చిన విధానాన్ని పర్యవేక్షించారు. ఈ మేరకు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మండల పరిధిలో పాఠశాలల సంఖ్య, విద్యార్థుల సంఖ్యను మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి పాఠశాల ప్రారంభం రోజునే కిట్లు అందజేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఒక వృద్ధుడు రైలు ఢీకొని మంగళవారం మృతి చెందాడు. రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ కథనం ప్రకారం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న గూడ్స్ రైలుకు అడ్డుగా సామర్లకోట సౌత్ కేబిన్ (ఫ్లైఓవర్ వైపు) వద్ద నిలబడటంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. స్టేషన్ మేనేజరు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై పి.వాసు తెలిపారు. మృతుడు తెలుపు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని, సుమారు 65 ఏళ్ల ఉంటాయని, 5'6 ఎత్తుతో ఉన్నాడని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



డీఎస్పీ శ్రీహరిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దాపురం నియోజకవర్గ పాత్రికేయులు



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న పిఠాపురం జర్నలిస్టులు

- సాక్షి కార్యాలయాలపై దాడి చేసిన వారిని శిక్షించాలి
- డీఎస్పీ కార్యాలయం వద్ద పాత్రికేయుల శాంతియుత ఆందోళన
- పిఠాపురంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు

పెద్దాపురం: రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై టీడీపీ నేతల దాడులను నిరసిస్తూ మంగళవారం నియోజకవర్గ పాత్రికేయులు శాంతియుత నిరసన చేపట్టారు. నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు అడపా వెంకట్రావు, ఐజేయూ సభ్యులు రాకుర్తి రాంబాబుల ఆధ్వర్యంలో స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఎస్పీ శ్రీహరిరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు అరికట్టాలన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాక్షి చానల్‌లో తమకు వ్యతిరేకంగా కథనం ప్రసారమైందన్న కక్షతో కూటమి ప్రభుత్వ హయాంలో పత్రికలపై దాడులు చేయడం, ఫర్నిచర్ ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా పత్రికా ప్రతినిధులు, కార్యాలయాలపై దాడులు ఆపాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాత్రికేయులు దేవరకొండ సుధాకర్, ఆలీ, అడపా శ్రీనివాస్, విజయ్, పెమ్మాడి వీరభద్ర వర్మ, బిక్కిన వెంకట్ , చవ్వాకుల ఈశ్వరరావు, ఉప్పలపాటి చంద్రదాస్, జి.సుబ్రహ్మణ్యం, పి.అశోక్, సిద్ధూ, విల్సన్‌రాయ్, ఎస్.అశోక్, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' కార్యాలయాలపై దాడులు తగవు

పిఠాపురం: కూటమి నేతలు సాక్షి దినపత్రిక కార్యాలయాలపై దాడులకు దిగడం, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసు బనాయించడంపై చర్యలు తీసుకోవాలని, పత్రికా స్వేచ్ఛపై దాడులను అరికట్టాలని కోరుతూ పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో మంగళవారం స్థానిక జర్నలిస్టులు ఎస్సై మణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రత్యేక్ష ప్రసారం జరుగుతున్న డిబెట్‌లో ఒక జర్నలిస్టు మాట్లాడిన మాటలను సాక్షి దినపత్రికకు ఆపాదించడం సరికాదన్నారు. ఎటువంటి సంబంధం లేదని చెబుతున్నప్పటికీ వినకుండా పత్రికా కార్యాలయాలపై భౌతిక దాడులకు దిగడం పత్రికా స్వేచ్ఛపై దాడిగా భావించాలన్నారు. పత్రికా కార్యాలయాలపై దాడి చేసి ధ్వంసం చేస్తే పత్రికా యాజమాన్యం కంటే ఆ పత్రికలో పని చేసే వేలాది మంది జీవనోపాధి దెబ్బ తింటుందన్న విషయాన్ని గమనించకుండా పత్రికా కార్యాలయాలపై దాడులకు దిగి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులు పెరిగిపోయాయని వీటిని ప్రభుత్వం వెంటనే అరికట్టి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలోను జర్నలిస్టులు ఇలా వినతిపత్రాలు ఇవ్వగా అక్కడ ఎక్కడా లేని విధంగా వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన జర్నలిస్టుల పూర్తి అడ్రస్‌లు ఆధారాలు తీసుకోవాలని పట్టణ ఎస్సై మణికుమార్ తన సిబ్బందిని ఆదేశించడంపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ముగిసిన కిశోరి వికాసం తరగతులు



బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది

పిఠాపురం: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. సీడీపీఓ సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, గొల్లప్రోలు మండలం చేబ్రోలు, గొల్లప్రోలు గ్రామాల్లో వేసవి శిబిరం ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గారాణి మాట్లాడుతూ ఈ తరగతులు బాలికలను కమ్యూనికేషన్ స్కిల్స్, బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహ నిర్మూలన చట్టాలు తదితర అంశాలలో చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి దోహదపడ్డాయన్నారు. శిక్షణ తరగతులకు సహకరించిన బాలికలకు, వారి తల్లిదండ్రులకు గొల్లప్రోలు ఎంపీడీవో కె.స్వప్న సన్మానం చేసి, బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సమయ పాలన నేర్పాలని!

తంచనుగా 5 గంటలకే తహసీల్దార్ కార్యాలయం గేట్లు మూత



కార్యాలయం గేటుకు పెట్టిన బోర్డు చూసి నిరాశగా చూస్తున్న వ్యక్తి

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం గేట్లు ఠంచనుగా ఐదు గంటలకే మూసేస్తున్నారని, ఐదు గంటలకే 'కార్యాలయ వేళలు ముగిసినవి' అని బోర్డు పెడుతున్నారని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు పేర్కొన్నారు. అధికారులు ఉన్నంత వరకు ప్రజలు వారిని కలుసుకొనే అవకాశం ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ ప్రజలతో పాటు మండల పరిధిలోని 18 గ్రామాల ప్రజలు సుమారు 6 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కార్యాలయానికి వస్తుంటారని, వారంతా ఈ బోర్డు చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆయన అన్నారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డిని ఈ విషయమై వివరణ కోరగా పని వేళలను ప్రజలకు అలవాటు చేయడానికి అలా బోర్డు పెట్టామని, అత్యవసర పనులపై వచ్చినవారి కోసం గేట్లు తీస్తామని తెలిపారు. నిత్యం ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ముఖ్యమైన పనులకు అవకాశం ఉండడం లేదని, అందువల్ల సమయం కాగానే గేట్లు మూసేస్తున్నామని వివరించారు.

ఘనంగా చండీహోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు



తాళ్ల ఉత్సవంలో గరగల నృత్యం చేస్తున్న కళాకారులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాల నడుమ వెండి, బంగారు పుష్పాలతో హోమం, పూజ, అర్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఊయల తాళ్ల ఉత్సవం

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ప్రారంభమయ్యే మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా నిర్వహించే ఊయల తాళ్ల ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాత పెద్దాపురం నుంచి ఆలయ మర్యాదలతో తాటిచెట్టును కొట్టి అక్కడి నుంచి తాళ్లతో మోసుకు వచ్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. దీన్ని పురస్కరించుకుని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పాత పెద్దాపురం నుంచి తాటిచెట్లకు తాళ్లు కట్టి పట్టణంలో ఊరేగించారు. భారీ జనంతో గరగల నృత్యం, డప్పులతో వార్డుల్లో తిరుగుతూ అమ్మవారి గుడికి తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మౌనిక పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉరిమే ఉత్సాహం బాలల సొంతం



ముగింపు కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: ఉరిమే ఉత్సాహం బాలలకే సొంతమని, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహపడతాయని ఆర్డీఓ కె.శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో 34 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు సభ మంగళవారం పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఆర్డీఓ, డీఎస్పీ మాట్లాడుతూ పిల్లల ప్రపంచం చాలా ఆనందమైందని, వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు. చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు, బాలల రంగం రాష్ట్ర కన్వీనర్ కోరెడ్డి రమాప్రభ, యూటీఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర వర్మ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి శిక్షణ ఇచ్చిన పీసీసీ కమిటీని అభినందించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన జానపద కళారూపాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి, బేబీరత్నం, అల్లక రమణ, రొంగల అరుణ్, కూనిరెడ్డి రవికుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి రాయితీపై బస్‌పాస్‌లు

బోట్‌క్లబ్: కాకినాడ ఆర్టీసీ డిపో పరిధిలోని అన్ని స్కూల్, కళాశాల విద్యార్థులకు ఈ నెల 14 నుంచి రాయితీపై బస్సు పాస్‌లను ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్‌ల కోసం ఈ నెల 12, 13 తేదీల్లో బస్సు పాస్ కౌంటరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు రాయితీ బస్‌పాస్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరప: గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలం వేములవాడ గ్రామానికి చెందిన పుణ్యమంతుల కృష్ణమూర్తి భార్యకు ఒక సంవత్సరం నుంచి మతిస్థిమితంలేక పోవడంతో కాకినాడలోని ఒకప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కానీ ఆమెకు వ్యాధి తగ్గక పోవడంతో ఆమె రాత్రుళ్లు పడుకోక, ఇంట్లోవారిని నిద్ర పోనీయకపోవడంతో కృష్ణమూర్తి (67) మనస్తాపానికి గురై ఈనెల 3వ తేదీన సాయంత్రం 4.30 గంటల సమయంలో పొలంలో గడ్డిమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న అతని కుమారుడు ఏడుకొండలు చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతకు భరోసా ఏదీ?

- రైతులకు అందని ప్రభుత్వ సాయం
- ఇచ్చిన హామీని విస్మరించిన ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



వరి పంటను కోస్తున్న యంత్రం



వాకతిప్పలో పూర్తి కాని రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు

కొత్తపల్లి: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు, తదితర పథకాలు అందజేసేందుకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్నా ఇంతవరకూ రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పేరు మార్పు తప్ప సాయం లేదు

మండలంలో 10,254 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సుమారు 6073 మంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం నుంచి దశల వారీగా డీబీటీ విధానం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా సొమ్మును అందజేసేవారు. ప్రస్తుం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయినా కాని నేటికీ ప్రభుత్వం రైతులకు భరోసా అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి రైతు సేవా కేంద్రాలుగా నిర్వహిస్తున్నారు. కానీ రైతులకు సాయం అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడుతున్నారు.

అసంపూర్తిగా భవనాలు

గత ప్రభుత్వం మండలంలోని 18 పంచాతీలకు 24 గ్రామ సచివాలయాలుగా విభజించింది. 24 గ్రామ సచివాలయాలకు 23 భరోసా కేంద్రాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.21 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. వీటిలో నాలుగు కేంద్రాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. రైతులకు శిక్షణ కార్యక్రమాలు, విత్తనాలు, ఎరువులు అందడం లేదని చెబుతున్నారు.

అందని పెట్టుబడి సాయం



ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయినా నేటికీ పెటుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం అందజేయ లేదు. ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా సొమ్ము అందించలేదు. రైతులందరం ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలి.

– కాజులూరి నేరేళ్లరెడ్డి, రైతు, రమణక్కపేట

వినియోగంలోకి తీసుకురావాలి



గత ప్రభుత్వంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– జి.లక్ష్మణరావు, వాకతిప్ప, రైతు

అధినేతతో ఆత్మీయ కలయిక



సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నియోజక వర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు మంగళవారం సాయంత్రం కలుసుకున్నారు. సుమారు నెల రోజుల పాటు అమెరికా పర్యటనలో ఉండి ఇటీవల నియోజకవర్గానికి వచ్చిన దొరబాబు తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలుసుకున్నారు.

మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించాలి



సామర్లకోట నుంచి కాకినాడకు వెళ్లిన మహిళలు

సామర్లకోట: కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకపోవడంతో మంగళవారం వారంతా కాకినాడకు తరలివెళ్లి ఆందోళన చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం పిలుపు మేరకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మహిళలు కాకినాడ ఇంద్రపాలెం లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేయడానికి వెళ్లారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ ఆధ్వర్యంలో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, కౌన్సిలర్లు రెడ్నం సునీత, రెడ్డి లోవకుమారి, చిట్టుమాని రాఘవ, కానేటి రాజేశ్వరి, పెండ్యాల నాగవెంకటలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

డాక్టర్ చందలాడ సేవలు మరువరానివి



డాక్టరు చందలాడ అనంతపద్మనాభం దంపతులను సత్కరిస్తున్న అభిమానులు

సామర్లకోట: డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం సేవలు మరువ లేనివని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, లయన్స్ క్లబ్ గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు దవులూరి సుబ్బారావు అన్నారు. 53 ఏళ్లపాటు చంటి పిల్లల వైద్యునిగా సేవలు అందించిన సందర్భంగా స్థానిక పూర్ణా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 80 వసంతాలు పూర్తయినా చంటి పిల్లలకు ఆయన అందిస్తున్న వైద్యాన్ని ప్రజలు మరువలేరన్నారు. 40 ఏళ్ల క్రితం రాజకీయాలల్లో ప్రవేశించి మున్సిపల్ చైర్మన్‌గా పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. చందలాడ దంపతులను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు పసల పద్మరాఘవరావు, పసల సత్యానందరావు, బిక్కిన సాయి, తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించారు.

భూసార పరీక్షలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు రైతు సేవా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వ్యవసాయంలో తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎలికె ప్రసాద్, డాక్టర్ బినాగేశ్వర్ రెడ్డి (పశుసంవర్ధక), డాక్టర్ రవీంద్ర (ఆక్వా కల్చర్) హాజరై వివిధ అంశాలను రైతులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రైతులకు పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, ఎన్ఎఫ్ఎస్ఎం భూసార పరీక్ష ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, పెద్దాపురం డీఆర్సీ వ్యవసాయ అధికారి డాక్టర్ సంజీవ్, మండల వ్యవసాయ అధికారి కేవీవీ సత్యనారాయణ, ఉద్యాన అధికారి శైలజ, చేబ్రోలు, లక్ష్మీపురం, దుర్గాడ, మల్లవరం ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు

కాకినాడ రూరల్: మరణించిన తరువాత మన శరీరంతో పాటు కళ్లు మట్టిలో కలిసిపోతాయని, ముందుగానే అవయవదానంపై అవగాహన పెంపొందించుకుని కళ్లు దానం చేసేందుకు అంగీకరించడం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించిన వారమవుతామని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ నేత్ర దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్దరాజు సత్యనారాయణ, ప్రసాద్ నాయుడు, ఓం నమశ్శివాయ పాల్గొన్నారు.